# స్పృహ

**అ**మ్మ అందరికీ అమ్మే! మా అమ్మ నా స్నేహితులందరికీ  అమ్మే.

మా అమ్మ తినడానికి ఏం చేసినా నాతో ఉన్న నా స్నేహితులందరికి నాతో పాటు పెడ్తుంది. అంతేకాని నన్నొక్కడిని లోపలికి పిలిచి చాటుగా తినడానికి పెట్టదు. సారథీ వాళ్ళ పిన్నీ అంతే. అతనికి అమ్మ పోతే వాళ్ళ నాన్నగారు మరో పెళ్ళి చేసుకొన్నారు. ఆవిడే సారథీ వాళ్ళ పిన్ని. మా అందరికీ పిన్ని. సారథి అన్నం తినే సమయానికి నేను వాళ్ళింట్లో ఉండి నా భోజనం అవకపోతే, "సారథితో పాటు రెండు కూరముక్కలు వేసుకొని కొద్దిగా అన్నం తిను. మీ ఇంటికి వెళ్ళి అన్నం తినేవరకు ఆకలి వేయకుండా ఉంటుంది" అంటుంది. నేను తింటాను. అమ్మ "తిన్నావా! పోన్లే మనవాళ్ళేగా" అంటుంది.

ఇవాళ నాన్నగారు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి, "మనకి మరో ఊరు ట్రాన్స్ఫర్ అయింది" అని చెప్పారు.

కొత్త ఊర్లో కొత్తగా  స్నేహితులని వెతుక్కోవాలి కాబోలు! అక్కడ సారథులు, వాళ్ళ పిన్నులు ఉండాలి దేవుడా!

* * *

మరో ఊర్లో మాకు ఇల్లు దొరికినచోట మంచి స్కూళ్ళు లేవు. మంచి స్కూళ్ళకి నన్ను పంపాలంటే నేనింకొంచెం పెద్దవాడినవాలి అన్నారు నాన్నగారు. ఎందుకంటే అవి దూరంగా ఉన్నాయి. అందుకని నేను చేపల బజారు స్కూల్లో చేరాను. ఇదీ పెద్ద దగ్గర కాదు. ఆ స్కూలు అసలు పేరు రిక్షా వాళ్ళకి కూడా తెలియదు. అందరు దాన్ని చేపల బజారు స్కూలనే అంటారు.

ఇవాళ క్లాసులో మేము గొడవ చేస్తుంటే హెడ్ మాస్టారు దేవసహాయం గారేమన్నారు?

"వెధవల్లారా! స్కూల్లో చదువుకోడానికి వచ్చారా! లేక ఎదురు బజారులో చేపలు కొనడానికి వచ్చి పొరపాట్న స్కూలుకి వచ్చారా! ఇక్కడ లెక్కల చేపలు, సైన్సు చేపలే ఉంటాయి. అవి తినలేరు. దెబ్బలు తినగలరు.  ఆ శర్మని చూసి బుద్ధిగా ఉండటం నేర్చుకోండి".

దాంతో క్లాసులో మంచిపేరు వచ్చిందో లేదో గాని ఆలీ, "శర్మాగాడికి ఈ దెబ్బతో టెక్కు పెరిగిపోతుంది" అన్నాడు. అతనికి బుద్ధిగా చదువుకునే వాళ్ళు నచ్చరను కొంటాను. ఆశీర్వాదం మాత్రం, "ఒరేయి శర్మా! నీకు టెక్కెక్కుతుందా?" అని అనుమానంగా అడిగాడు.

నేను జవాబు చెప్పలేదు.

స్కూలు విడిచి పెట్టాక సుగుణ అనే పిల్ల, "నువ్వు పెద్ద ఊరు నుంచీ వచ్చావు కదా! అన్నీ ఇంతకు ముందే నేర్చేసుకొని ఉంటావు. అందుకే బుద్ధిగా, నిశ్శబ్దంగా కూర్చుంటావు. మాకు అర్థంకాక పక్కవాళ్ళని అడుగుతూ ఉంటే గొడవ చేస్తున్నాం అనుకొని పెద్ద మేస్టారు తిట్టారు" అంది నా దగ్గరికి వచ్చి.

ఆ పిల్ల కళ్ళు ఎంత పెద్దవో చక్కగా. ఇంకొంచెం మంచి గౌను వేసుకొంటే ఇంకా బావుంటుంది అనుకొన్నాను.

"నాకు పెద్దగా పాఠాలు ఎక్కువేం రావు" అని చెప్పాను.

ఆ పిల్ల నాతో నడిచింది కొద్దిదూరం. చేపల బజారు దాటాక ఎడం వైపు తిరుగుతూ, "ఆ పై సందులో మా ఇల్లు" అంది.

"నేను వచ్చేదా మీ ఇంటిదాకా!" అని ఆశగా అడిగాను.

"మగపిల్లలు మా ఇంటికి వచ్చినా, నేను మరో మగ పిల్లాడి ఇంటికి వెళ్ళినా మా నాన్న చావగొడ్తాడు. వద్దు బాబూ" అంది.

నాకు సారధి వాళ్ళ నాన్నగారు గుర్తుకు వచ్చారు. సారధి నన్ను అన్నిసార్లు వాళ్ళింటికి తీసుకువెళ్ళినా ఒక్కసారి ఆయన సారధిని చావగొట్టలేదు. ఈ సుగుణా వాళ్ళ నాన్నకి ఇదేం బుద్ధో! అమ్మతో చెప్పాను.

అమ్మ, "సారధి! మగపిల్లాడ్రా" అంది.

సుగుణ ఆడపిల్ల కదా! నేను స్నేహానికి పనికిరానన్నమాట...

ఇవాళ క్లాసుకి మేస్టారు రాలేదు. నేను బుద్ధిగా లెక్కల హోమ్‌వర్క్ చేస్తున్నాను. గౌతమి నా దగ్గరకు వచ్చి నేను చేస్తున్న లెక్కచూసి –

"నీకీ లెక్క చెయ్యడం వచ్చా శర్మా!" అంది.

అంటే తనకి రాదన్న మాటే కదా! నాక్కొంచెం గర్వం కలిగి, "వచ్చు" అన్నాను. తలెత్తి చూసి మళ్ళీ లెక్కల్లోకి కళ్ళు దించేసుకొన్నాను.

"గోదావరీ! శర్మ రెండో అభ్యాసంలో మూడో లెక్క చేస్తున్నాడు" అని అరిచింది గౌతమి.

గోదావరికి, గౌతమికి అదెల్లా చెయ్యాలో చెప్పాను.

"సాయంత్రం మా ఇంటికి రా!" అని పిలిచారు.

లాంగ్ బెల్ కొట్టాక వాళ్ళతో వాళ్ళింటికి వెళ్ళాను.

ఎందుకైనా మంచిదని, "నేను వస్తే మీ నాన్న మిమ్మల్ని చావగొడ్తాడా?" అని అడిగాను.

"ఎందుకు కొడ్తాడు? కొడ్తాడేమో అన్న అనుమానం నీ కెందుకు వచ్చింది?" అని అడిగారు వాళ్ళు.

క్రితం  బుధవారం సుగుణ ఏమందో చెప్పాను.

"వాళ్ళ ఇళ్ళల్లో మగాళ్ళు అంతే. ప్రతీదానికి పెళ్ళాలనీ, చెల్లెళ్ళనీ, కూతుళ్ళనీ కొడ్తారు" అంది గోదావరి.

"మా ఇంట్లో ఆడపిల్లల్ని ఓ మాట కూడా అననియ్యదు మా మామ్మ" అంది గౌతమి.

అయితే వీళ్ళతో స్నేహం చెయ్యవచ్చన్నమాట.

వాళ్ళ ఇంటికి వెళ్ళాం. వాళ్ళ నాన్నగారు కోర్టు నుంచి రాలేదు. వాళ్ళ అమ్మగారితో నాకు లెక్కలు బాగా వచ్చు అని చెప్పారు. వాళ్ళ అమ్మగారు నాకు వాళ్ళతోపాటు ఉప్మాపెట్టారు. నాకు లెక్కలు రాకపోయినా పెడ్తారా? అన్న అనుమానం వచ్చింది కాని అది తీరటం ఎల్లా!

గౌతమి, గోదావరి కవలలట.

"వీలైనప్పుడల్లా వస్తూ ఉండు" అన్నారు వాళ్ళ అమ్మగారు.

ఇంటికి వచ్చి అమ్మతో చెప్పాను ఇద్దరు మంచి అమ్మాయిలు స్నేహితులయ్యారని

"వాళ్ళని మన ఇంటికి తీసుకురా" అంది అమ్మ

అమ్మకూడా ఒప్పుకొంది - వాళ్ళతో స్నేహం చెయ్యటాన్ని.

ప్రేయర్‌కి ఫస్ట్ బెల్ అయింది. గోదావరి, గౌతమి ఎప్పుడు వస్తారా అని చూస్తున్నాను. వాళ్ళు కాస్త ఆలస్యంగా వచ్చారు. వాళ్ళ పక్కన చేరి మెల్లిగా రహస్యంలా అన్నాను.

"మా అమ్మ మిమ్మల్ని మా ఇంటికి తీసుకురమ్మంది"అని.

"మా అమ్మనడిగి చెప్తాం" అంది గోదావరి.

క్లాసుకు వెళ్తుంటే, "శర్మ, ఆడపిల్లల చెవుల్లో రహస్యాలు చెప్తున్నాడు" అన్నాడు ఆశీర్వాదం.

ఆలీ నవ్వాడు. నాకు కోపం వచ్చింది. వాడు నాకు నచ్చడు, వాడెప్పుడూ, "శర్మా వెంటు బర్మా ఆన్ ఎకౌంట్ ఆఫ్ హిజ్ కర్మా" అని ఉడికిస్తూ ఉంటాడు.

నిన్న అడిగిన దానికి ఈ రోజు గౌతమి సమాధానం చెప్పింది -

"మా నాన్నగారు మమ్మల్ని ఇంకోళ్ళ ఇంటికి పంపితే మా అమ్మని కోప్పడ్తారుట" అంటూ.

"మా అమ్మలు కోప్పడరు - మేం రామా?" అన్నాడు ఆలీ నన్ను ఉడికిస్తూ.

"రండి" అన్నాను, నా కాడపిల్లలంటే ప్రత్యేకమైన అభిమానం ఏం లేదు కదా!

ఇంటికి వెళ్ళాక అమ్మతో చెప్పాను గౌతమి వాళ్లు అన్నది.

"వాళ్ళు నియ్యోగులు కామోసురా! వాళ్ళకి రాజసాలుంటాయి. ఇంకోళ్ళ ఇళ్ళకి వెళ్ళరు" అంది అమ్మ.

మేం వైదీకులమని అమ్మ చెప్పింది. వైదీకులకి మాత్రం నియోగుల ఇంటికి వెళ్ళే ఖర్మేమిటి! నేనూ వెళ్ళను . చిన్న తేడాతో స్నేహం కుదరలేదు. పోన్లే!

* * *

జోసఫ్ మేస్టారు క్లాసుకి క్వార్టర్లీ పరీక్షల ప్రోగ్రెస్ కార్డులు తీసుకు వచ్చారు.

"రాఘవమ్మా! నీ ఫస్టు ర్యాంక్ శర్మ కొట్టేశాడు. నీకీయేడు గట్టి పోటీ తగిలింది. నువ్వు బాగా కష్టపడితేగాని నీకు ఈ సంవత్సరం ఫస్టు ర్యాంక్ దక్కదు. బాగా చదువు" అన్నారు రాఘవమ్మ కార్డిస్తూ.

జోసెఫ్ మాస్టారు వెళ్ళిపోయాక, "ఏం పిల్లాడా! నీకెన్ని మార్కులు వచ్చాయి?" అని రాఘవమ్మ నన్నడిగింది.

చెప్పాను.

"ఓష్! రెండు మార్కులే కదా నా కన్నా ఎక్కువ!" అంది ఆ అమ్మాయి.

అంటే ఆ పిల్లకి నాకంటే రెండు మార్కులు తక్కువ వచ్చాయన్నమాట. కాని తను పెద్ద కష్టపడకుండా నన్ను దాటెయ్య గలనన్న ధీమా చూపింది. ఆ పిల్ల. నాకా ధీమా చూస్తే కొంచెం భయం వేసింది. ఈ పిల్లకి భయం తక్కువ. మనస్సులో  ఉన్న మాట ధైర్యంగా పైకి అనెయ్యగలదు.

"మీ ఇల్లెక్కడ?" అని అడిగింది. ఆ అడగటంలో అధికారం ఉంది ఆ అధికారం చూస్తే నాకు జవాబు చెప్పాలనిపించలేదు. కాని చెప్పాను.

"పార్కు దగ్గర" అని. అల్లా ఎవరైనా దబాయించినట్టయితే మనకి భయం వేస్తుంది గదా!

"మాఁవు పోలీసు కోర్టర్సులో ఉంటాం. నువ్వు మీ ఇంటికి మా ఇళ్ళ మీదుగానే వెళ్తావు" అంది.

పోలీసు వాళ్ళ అమ్మాయి కనకే ఆ ఫోర్సు అనుకొన్నాను.

దార్లో వాళ్ళ ఇల్లు చూపించింది.

"రేపట్నుంచి మా ఇంటికి రా! మనిద్దరం కలిసి స్కూలుకి వెళ్ళచ్చు" అంది.

'రాణిగారు ఆజ్ఞాపిస్తోందా?' అనుకొన్నాను.

అమ్మతో రాఘవమ్మ గురించి చెప్తే, "చదువులో పోటీ మంచిది. ఆ పిల్లతో స్నేహం నీకు మంచిది" అంది.

అమ్మ ఏం చెప్పినా ఆలోచించి చెప్తుంది. మనకేది మంచో అమ్మలకే తెలుస్తుంది కదా!

* * *

స్కూలుకి వెళ్తూ రాఘవమ్మ ఇంటికి వెళ్ళాను. వాళ్ళ నాన్న కాబోలు వరండాలో

ఉన్నాడు. లూజు కాకీ లాగు, తెల్ల చేతుల బనియను వేసుకొని మంచి లావుగా, ఎత్తుగా ఉన్నాడు.

"మా అమ్మాయి మీద ఫస్టు వచ్చింది నువ్వే కదా?" అని అడిగాడు ఆయన, నన్ను.

అందుకుగాని తన్నడు కదా! ఎందుకొచ్చా(న్రా బాబూ! అనుకొని, "అవును" అన్నాను సన్నగా, చిన్నగా .

"మా రాఘవ చెప్పిందిలే! కూచోబాబు! రాఘవ ఇప్పుడే వస్తుంది" అని నాకో కుర్చీ చూపించాడు.

అనవసరంగా భయపడ్డాను. పోలీసుల్లో మంచివాళ్ళు కూడా ఉంటారు.

సాయంత్రం రాఘవమ్మతో ధైర్యంగా వెళ్లాను వాళ్ళింటికి. వాళ్ళమ్మ వేయించిన అటుకులు, కొబ్బరి ఉండ పెట్టింది. తిన్నాను, బావున్నాయి.

మొన్నట్నుంచి రాఘవమ్మతో కలిసి స్కూలుకి వెళ్ళటం, కలిసి వెనక్కి రావటం చేస్తున్నాను. ఇవాళ రాఘవమ్మ మా ఇల్లు చూడటానికి వచ్చింది. అమ్మ రాఘవమ్మకి జంతికలు పెట్టింది. గ్లాసుతో మంచినీళ్ళిచ్చాను. తాగింది. అమ్మ, రాఘవమ్మని "మీరెవరు?" అని అడిగింది.

"మాఁవు యాదవులం" అని చెప్పింది రాఘవమ్మ.

రాత్రి అన్నం పెడ్తూ అమ్మ చెప్పింది – "వాళ్ళింటికి వెళ్తే తప్పు లేదు, వెళ్ళు. వాళ్ళు పాలో, కాఫీయో, మజ్జిగో ఇస్తే తాగు. అంతేకాని, వాళ్ళ తిళ్ళు తినకు. వాళ్ళు అన్నీ ఆ గిన్నెల్లోనే వండుతారు" అని.

అమ్మ అన్నీ అని వేటినందో నాకు అర్థమైంది. వాళ్ళు ఏదైనా తినటానికి పెట్టినప్పుడు అమ్మ చెప్పిన మాట గుర్తుంచుకోవాలి. మనం అన్నీ తినం కదా!

* * *

నవంబర్ నెల కదా కొంచెం చలిగా ఉంది. అందుకని మధ్యాహ్నం అన్నం తిన్నాక పిల్లలం ఎండలో బాల్ బాడ్మింటన్ ఆడ్తున్నాం.

"ఈ శర్మా వెంటు బర్మాగాడు బంతిని బాగానే కొడ్తున్నాడు" అన్నాడు అటువైపు ఆడ్తున్న ఆలి.

"వీడికి బంతాటలు బాగానే వచ్చు" అన్నాడు నావైపు ఆడ్తున్న ఆశీర్వాదం.

పెద్దక్లాసు కుర్రాళ్ళు నవ్వారు. ఈ ఆలీ, ఆశీర్వాదాలూ నా స్నేహితులైతే తప్ప, నన్ను వాళ్ళు వేళాకోళం చేయడం మానరనిపించింది.

లాంగ్‌బెల్ అయింది.

ఆశీర్వాదం, "నీకు పెద్ద బంతులాటలు వచ్చురా శర్మా" అని అడిగాడు.

"అంటే...?"

"ఫుట్‌బాల్, వాలీబాల్" అన్నాడు ఆలీ.

"నేర్పితే నేర్చుకుంటాను" అన్నాను.

"ఆ రాఘవమ్మతో ఇంటికి పోతావేమో కదా! ఉంటే కాస్సేపు మాతో ఆడుదూగాని" అన్నాడు ఆశీర్వాదం.

రాఘవమ్మ నా కోసం ఆగింది.

"నేను ఆడుకొని వస్తాను, నువ్వు వెళ్ళు" అన్నాను.

"ఆలీ, ఆశీర్వాదాలు అల్లరోళ్ళు జాగ్రత్త" అంది రాఘవమ్మ వెళ్ళిపోతూ.

అయినా వాళ్ళతోనే ఆడటానికి ఉండిపోయాను. ఆడపిల్లలతో స్నేహం ఎన్నాళ్ళో నిలబడదు. వాళ్ళు మనం ఆడే ఆటలు ఆడరు.

* * *

ఆలీ, ఆశీర్వాదాలు – 'శర్మా వెంటు బర్మా అన్ ఎకౌంట్ ఆఫ్ హిజ్ కర్మా' అని నా వెంట పడటం మానేసారు. నన్ను వాళ్ళ జట్టులో కలుపుకొన్నారు. వాళ్ళు కొన్ని పోకిరీ మాటలంటూ ఉంటారు. అవి నాకు గిలిగింతలు పెడ్తూ ఉంటాయి.

రాఘవమ్మ మా ఇంటికి వచ్చింది.

ఇవాళ ఆదివారం – ఎందుకు వచ్చిందో.

"ఏం శర్మా! మా ఇంటికి రావడం తగ్గించేసావు?" అని అడిగింది.

"పొద్దున్నలు వస్తూనే ఉన్నానుగా. సాయంత్రాలు ఆడుకోడానికి ఉండిపోతున్నాను" అన్నాను.

ఆటలే కాదు, పక్కన నదిలో ఆలీ, ఆశీర్వాదాలు అప్పుడప్పుడు నాకు ఈత నేర్పుతున్నారు. బట్టలు తడవకుండా పూర్తిగా గుడ్డలు విప్పేసి స్నానం చేయటం వాళ్ళే నేర్పారు. అమ్మకి తెలియదు. తెలిసినవాళ్ళు ఎవరూ చూడనప్పుడు సిగ్గుండదు.

ఇంతలో అమ్మ లడ్డూలు తెచ్చి నాకు, రాఘవమ్మకి పెట్టింది.

"మాఁవు మా ఇంట్లో ఏం పెట్టినా సయించవంటూ శర్మ ఏమీ తినడు" అని కంప్లయింట్ చేసింది రాఘవమ్మ అమ్మతో.

అమ్మ నవ్వింది. అంతేకాని, "ఎందుకు తినడూ, తింటాడులే!" అనలేదు. నవ్వి లోపలికి వెళ్ళిపోయింది.

రాఘవమ్మ రెండోసారి లడ్డు కొరుకుతూ ఆగిపోయింది. రాఘవమ్మ కేదో తళుక్కుమని తట్టింది.

"మాంవు మీ ఇళ్ళల్లో తినడానికే పుట్టాం. మీరు మాత్రం మా తిళ్ళు తినరు. దిగొచ్చిన దేవతలు కదా! నీ వాలకం నా కర్థం కాదనుకుంటావు కాబోలు!" అంది.

'రాఘవమ్మకి అంతా తెలిసిపోయింది. అమ్మయ్య' అనుకొన్నాను. ఇంక గొడవేలేదు. తను పెట్టదు. నేను తినను.

ఇవాళ సోమవారం. నేను వాళ్ళింటికి వెళ్ళేసరికి రాఘవమ్మ ఇంట్లోలేదు. కావాలని నాకంటే ముందే స్కూలుకి వెళ్ళిపోయింది. తనకంత కోపం ఎందుకో నా కర్థం కాలేదు.

జోసెఫ్ మాస్టారు హాఫియర్లీ ప్రోగ్రెస్ రిపోర్టులిస్తున్నారు.

"రాఘవమ్మా! వెరీ గుడ్! మళ్ళీ ఫస్టొచ్చావు. దాన్ని చివరిదాకా నిలబెట్టుకో!" అన్నారు రాఘవమ్మతో.

నా ఛాన్సు వచ్చింది.

"శర్మా! నీకు పనికిమాలిన స్నేహాలు, తిరుగుళ్లూ ఎక్కువయ్యాయి. రాజరత్నంకి రెండో ర్యాంక్ వచ్చింది. నువ్వు మూడుకి పడిపోయావు. ఇల్లాగే కిందకి దొర్లుకొంటూ పో! మీ నాన్న నీ తోలు వలుస్తాడు. అలీ వాళ్ళ నాన్న అది శుభ్రం చేసి ఆశీర్వాదం వాళ్ళ నాన్న కిస్తాడు. ఆశీర్వాదం వాళ్ళనాన్న దాంతో చెప్పులు కుట్టి మళ్ళీ మీ నాన్నకిస్తాడు జాగ్రత్త" అన్నాడు జోసెఫ్ మేస్టారు.

ఏం చెయ్యను! అమ్మ చెప్పిన సూత్రం తుచ తప్పకుండా పాటిస్తే రాఘవమ్మ నా జుట్టుపచ్చి కొట్టేసింది. అందుకే వీళ్ళ విషయంలో, "వాళ్ళ తిళ్ళు తినకపోవడమే కాదు. వాళ్ళ ఇళ్ళకు కూడా వెళ్ళకు" అంటూ అమ్మ చెప్పినా అప్పుడప్పుడు వాళ్ళ ఇళ్ళకు వెళ్తూనే వున్నాను. వాళ్ళూ మా ఇంటికి ఎప్పుడైనా వస్తూనే ఉన్నారు. కాని వాళ్ళ ఇళ్ళకి నేను వెళ్తున్న విషయం అమ్మతో చెప్పలేదు నేను.

* * *

అమ్మ అరిసెలు చేసింది నిన్న. ఇవాళ ఆశీర్వాదం మా ఇంటికి వచ్చాడు. అమ్మ వాడికో అరిసె పెట్టింది. వాడు చాలా ఇష్టంగా తిన్నాడు. అమ్మకి వాడల్లా తినడం చాలా నచ్చింది.

"ఇంకోటి కావాలా?" అని అడిగింది. వాడు కావాలన్నాడు. అమ్మ ఇచ్చింది. వాడు తిన్నాడు. మా అమ్మ వాడికీ అమ్మే! వాడి అమ్మ నాకూ అమ్మే కదా! నేనూ వాళ్ళింట్లో తింటే ఆవిడ కూడా సంతోషిస్తుంది కదా! కాని అమ్మ తినద్దు అంటుంది. అన్నీ అందులోనే వండుతారని అల్లా అంది అనుకుంటాను.

"మీ అమ్మ అరిసెలు బాగా చేసింది కాని మా అమ్మ ఇంకా బాగా చేస్తుంది. ఈసారి మా అమ్మ చేసినప్పుడు నిన్ను పిలిచి పెడ్తాను" అన్నాడు.

వాడు పిలిచి పెట్టినప్పుడు ఏదో చెప్పి తప్పించుకొందాంలే అనుకొన్నాను.

*　　*　　*

రెండ్రోజులుగా కృష్ణవేణి క్లాసుకి రావటం లేదు. ఆ మాటే నా స్నేహితుల్తో అంటే ఆలీగాడు-

"ఏముంది పెద్ద మనిషై ఉంటుంది ఛోక్రీ!" అన్నాడు. "ఇంక సిగ్గులు వచ్చేస్తాయి చూడాలి."

"పెద్ద మనిషయింది" అంటూ ఉంటారు కదా! ఆ మాట కర్థమేమిటి?" అని అడిగాను.

"ఆడపిల్లలు అందంగా తయారవుతారు ఆ రోజు నుంచి" అన్నాడు ఆలీ.

మేము బట్టలు లేకుండా నదుల్లో స్నానాలు చేస్తాం. వాళ్ళు అన్ని బట్టలూ వేసుకొని కూడా సిగ్గుపడ్తూ ఉంటారు.

"అసలే కృష్ణవేణి బుగ్గలు అరిసెల్లా ఎర్రగా ఉంటాయి. అది ఇంకా అందంగా తయారవుతుంది" అన్నాడు ఆశీర్వాదం.

ఆశీర్వాదానికి అరిసెల పిచ్చి. రుచికి, అందానికి కూడా అరిసెలంటాడు.

"అన్నట్టు, శర్మా నిన్న మా అమ్మ అరిసెలు చేసింది. మా చెల్లి పుట్టినరోజుకి. ఆలీగాడు వచ్చి నిన్ననే తిన్నాడు. నువ్వు ఇవాళ రారా! పెడ్తాను" అన్నాడు ఆశీర్వాదం.

నేను వాడితో వాడింటికి వెళ్తుంటే వాళ్ళ వీధి మొదట్లో ఒకావిడ, "ఇస్కూలు పిల్లలు కదా! కాస్త ఈ ఉత్తరం చదివి పెట్టండి" అని ఒక కార్డు ఇచ్చింది.

ఆశీర్వాదానికి అది కొరుకుడు పడలేదు. ఆ ఉత్తరం ఆవిడకి, ఆవిడ మిలట్రీ మొగుడు రాసాడు. అందులో ఇంగ్లీషు మాటలు మనం రోజూ వాడేవే చాలా తెలుగులో రాసి ఉన్నాయి. నేను గడగడా చదివేసాను.

"ఈ పిల్లడెంత బాగా చదివాడో! మనోళ్ళకిల్లా చదవటం వచ్చుద్దా!" అని నన్ను మెచ్చుకొంది.

"వీడు మా క్లాసులో ఫస్టు" అన్నాడు ఆశీర్వాదం గర్వంగా.

నిజానికి నేను థర్డు.

వాళ్ళింటికి తీసుకువెళ్ళి ఆశీర్వాదం అరిసె పెట్టాడు.

"నేను దార్లో తింటాన్రా!" అని చెప్పి అది తీసుకుని బయల్దేరాను.

*　　*　　*

స్కూల్లో ఆశీర్వాదం నన్ను నిలదీసాడు

"ఏరా శర్మా! నిన్న అరిసె తిన్నావా?" అంటూ.

నేను దంగై పోయాను. నేను తినని విషయం వీడికి తెలిసిపోయింది ఎల్లాగో.

"లేదురా" అన్నాను తప్పు చేసినవాడిని కదా, తల వంచుకొని.

"తెలుసు, నువ్వు పారెయ్యటం మా చెల్లి చూసింది" అన్నాడు.

నేను ఎంతో తెలివిగా ఆ అరిసె పుచ్చుకొని వాళ్ళ ఇంటి నుంచి బయల్దేరి, వాడు ఇంట్లోకి వెళ్ళగానే నా చేతిలోది కుక్క ముందు పడేసాను. అది వాళ్ళ చెల్లి చూసే సిందన్నమాట.

"ఎందుకు పారేసావురా?" అని అడిగాడు.

అమ్మ పారెయ్యమనలేదు. అమ్మ తీసుకోవద్దంటుంది. కాని తీసుకున్నాను. తినేసి ఉంటే అమ్మకి తెలిసే అవకాశం లేదు. కాని నేనే ఆ ఇంట్లో చేసినది, ఆ వాతావరణంలో, ఆ తోళ్ళ వాసనల మధ్య తినలేక పోయాను. నా రక్తంలో నేను తినకుండా ఆపే గుణం ఉంది.

"సయించలేదురా" అన్నాను సిగ్గుపడుతూ.

"సయించకపోతే పారేస్తారురా. మా చెల్లికిస్తే అదైనా తినును కదా" అన్నాడు.

"ఎంగిలిది కదా!" అన్నాను.

"అన్నకి చెల్లికి ఎంగిలేమిట్రా! పైగా అరిసెలు రోజూ చేసుకొనేవి కావు కదా!" అన్నాడు.

అందరూ తిండి పారేసుకోరు. మా స్నేహంలో అసమానత ఉందనిపించింది ఆ క్షణాన్న.

వాడికి నేను పారేసినందుకు కోపం, పౌరుషం రాలేదు. చెల్లి తినడానికి తల్లి దాచింది, నా కిస్తే నేను పారేసాను! తిండి, అందులోను వాళ్ళ అమ్మ ఎంతో కష్టపడి చేసింది, వాళ్ళకి ఇష్టమైనది, అపురూపమైనది, కుక్క ముందు నిర్లక్ష్యంగా పారేసానని బాధపడ్తున్నాడు. నా కేడుపు వచ్చింది.

"ఇంకెప్పుడు పారెయ్యనురా! వద్దకపోతే తీసుకోనులే" అన్నాను.

"పోన్లేరా! నీ ఎంగిలి మా చెల్లి తింటుందని నీకు తెలిస్తే పారేసేవాడివి కావు కదా!" అని నాభుజం మీద చెయ్యి వేసాడు.